# శాంతిసాధనం

ప్రవాసి



**యు**వ బౌద్ధ బ్రహ్మచారి శాంతి గుప్తుడు ఇరవై సంవత్సరాలవాడు. అత్యంత యుక్తిశాలి, జ్ఞానశాలి, జ్ఞానార్జనాతత్పరుడు. పదిమంది తనని ప్రశంసించాలని, ప్రతిష్ఠాకీర్తి లభించాలనే ఇచ్ఛతో అనేక కళలను నేర్చుకునేందుకు ఎన్నో దేశాలలో సంచరించాడు. ఒకదేశంలో ఓడలు నిర్మించే కళ, ఒక దేశంలో గృహ నిర్మాణ కళ.... అట్టా అనేక దేశాల్లో తిరిగి అనేక కళలలో ప్రావీణ్యాన్నార్జించి తిరిగి వచ్చాడు. తానిన్ని కళల్లో నిపుణుడన్న గర్వంతో "నాకన్నా బుద్ధిశాలి కళా విశారదుడు ఎవరన్నా వున్నారా?" అని కనిపించిన ప్రతి మనిషిని అడిగేవాడు.

ఆ బ్రహ్మచారి దశనవలోకించిన బుద్ధ భగవానుడికి అతని మీద దయ కలిగింది. ఆ బ్రహ్మచారికి మహాజ్ఞాన కళని నేర్పించాలని వృద్ధశ్రమణక వేషాన్ని ధరించి, చేతిలో భిక్షా పాత్రని పట్టుకుని ఆ బ్రహ్మచారి ముందు నిలిచారు.

"నువ్వెవరివి?" అని శ్రమణకుడ్ని ఎంతో అహంకారంతో ప్రశ్నించాడు బ్రహ్మచారి.

"నేను ఆత్మ విజయ యాత్రికుడ్ని" అన్నారు బుద్ధ భగవాన్.

"నీవన్నమాటకి అర్థమేమిటి?" అని ప్రశ్నించాడు బ్రహ్మచారి.

"కుమ్మరి కుండలు చేస్తాడు. నావికుడు నౌకని అధీనంలో వుంచుకుని నడుపుతాడు. గృహ నిర్మాణం చేస్తాడు తాపీ మేస్త్రీ. కానీ తన శరీరాన్ని మనస్సుని అదుపులో పెట్టుకుని ఆత్మ విజయాన్ని సాధించాలి ఎంతటి మహా విద్వాంసుడైన సాధకుడైనా! అన్నారు బుద్ధుడు.

"అదెట్టా" అని ప్రశ్నించాడు బ్రహ్మచారి.

"ఏముంది. నిజమైన సాధకుడ్ని ప్రపంచం ఎంతగా ప్రశంసించినా అతని చిత్త వృత్తి స్థిర నిశ్చల శాంతి పూర్ణంగా వుంటుంది. ఒకవేళ ప్రపంచం అతన్ని నిందించినా హింసించినా గానీ అతని బుద్ధి విచలితం కాదు. ఏ సాధకుడు ఆ విధంగా వుండగలడో ఆ సాధకుడే శాంతిని నిర్వాణాన్ని పొందగలుగుతాడు" అన్నారు బుద్ధుడు.

బ్రహ్మచారికి తన తప్పిదం ఎరుక పడి, శ్రమణకుడ్ని క్షమాయాచన చేసి సాధనలో లీనమయ్యాడు వినమ్ర చిత్తంతో.

(ధమ్మపదం - విభాగం XIV ఆధారంతో)

## సమ్‌సారమ్

- బాబు

